## పాముకాటుతో రైతు మృతి

### నాగర్‌కర్నూల్ జిల్లా డిండిచింతపల్లిలో విషాదం




శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

వంగూరు, ఏప్రిల్ 14 : పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. వంగూరు మండలం డిండిచింతపల్లి గ్రామానికి చెందిన రైతు ఇందుర్తి శ్రీనివాస్‌రెడ్డి (55) సోమవారం తెల్లవారుజామున బర్రెలకు పాలు పిండటానికి పొలం వద్దకు వెళ్లాడు. పాలు పితికిన తర్వాత పశువులకు మేత వేసేందుకు చొప్పను కోస్తుండగా.. పాము కాటేసింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

# అడవులపైకి కాంగ్రెస్ బుల్డోజర్లు

- చెట్లను నరికివేసి వన్యప్రాణులకు హాని
- హెచ్‌సీయూ వివాదంపై ప్రధాని మోదీ
- హామీలను అమలు చేయడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజం
- పర్యావరణ పరిరక్షణపై మోదీ వ్యాఖ్యలకు 'గ్రోక్' చాట్‌బాట్ తనదైన శైలిలో కౌంటర్
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని వివరణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) అటవీ భూముల్లోని చెట్లను రేవంత్ ప్రభుత్వం బుల్డోజర్లు పెట్టి పెకిలించడాన్ని యావత్తూ దేశమంతా ముక్తకంఠంతో వ్యతిరేకించింది. కాంగ్రెస్ సర్కారు చర్యలపై హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలపై స్టే విధించారు. దేశమంతటా తీవ్ర చర్చకు దారితీసిన ఈ ఉదంతంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎట్టకేలకు నోరువిప్పారు. కంచ గచ్చిబౌలి అడవులను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేయడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు సోమవారం రేవంత్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. హర్యానాలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ సోమవారం ప్రసంగిస్తూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని అన్నారు. అడవుల్లో బుల్డోజర్లను దింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉన్నదని దుయ్యబట్టారు. చెట్లను నరికేస్తూ.. పర్యావరణానికి హాని చేస్తూ.. మూగజీవాలను కాంగ్రెస్ సర్కారు ప్రమాదంలో పడేస్తోందంటూ మండిపడ్డారు. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి తాము ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు అడవులను నాశనం చేస్తున్నారంటూ మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్షులు, నెమళ్లు, జింకలు వంటి మూగజీవాలకు ఆశ్రయమిస్తున్న 400 ఎకరాల హెచ్‌సీయూకు చెందిన అడవిని ధ్వంసం చేసి.. ఆ భూములను అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ తన నివేదికలో పేర్కొన్న నేపథ్యంలో దీనిపై ఈ వారంలోనే సుప్రీంకోర్టు విచారణ జరపనున్నది. ఈ క్రమంలోనే మోదీ ఈ వివాదంపై స్పందించారు.

### రాజకీయ ప్రయోజనాల కోసమే: గ్రోక్

హెచ్‌సీయూలోని అటవీ భూముల్లో రేవంత్ ప్రభుత్వం కొనసాగించిన విధ్వంసంపై ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఓ నెటిజన్ ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను ప్రశ్నించాడు. హెచ్‌సీయూ విషయంలో మోదీ నిజంగానే ఆందోళనతో ఉన్నారా? అంటూ సదరు నెటిజన్ గ్రోక్‌ను అడిగాడు. దీనిపై గ్రోక్ తనదైన శైలిలో వాస్తవాలను ప్రస్తావిస్తూ మోదీకి కౌంటర్ ఇచ్చింది. హెచ్‌సీయూలోని అడవిని రేవంత్ ప్రభుత్వం నాశనం చేస్తున్నదన్న మోదీ వ్యాఖ్యలు సరైనవేనని గ్రోక్ ఒప్పుకొంది. అయితే, మోదీ హయాంలో పర్యావరణ పరిరక్షణ చట్టాలు నిర్వీర్యమైన విధానాన్ని గ్రోక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. అభివృద్ధి పేరిట అండమాన్ నికోబార్ దీవులు, హిమాలయ ప్రాంతాల్లో అడవులను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని పేర్కొంది. హెచ్‌సీయూ వివాదంలో ఒకవైపు చెట్లను రక్షించాలని మోదీ చెప్తూనే.. మరోవైపు పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారని మండిపడింది. దీన్నిబట్టి, మోదీ తాజా వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసం చేసినవేనని గ్రోక్ తేల్చి చెప్పింది.



# ఆ భూములు మావే

- 50 హెక్టార్ల భూమి వరకూ రాష్ట్రానిదే అధికారం
- పర్యావరణ నిబంధనలు ఏమాత్రం అతిక్రమించలేదు
- 20 ఏండ్లుగా కోర్టు కేసుల వల్లనే చెట్లు పెరిగాయి
- కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంలో రాష్ట్రం అఫిడవిట్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి తమదేనని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆన్‌లైన్ ద్వారా కోర్టుకు ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన నేపథ్యంలో డెడ్‌లైన్‌కు రెండు రోజుల ముందే అఫిడవిట్‌ను అందించినట్టు తెలుస్తున్నది. కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్న వృక్షాలను నరికివేసి, భూమి వేలం వేసేందుకు సర్కార్ సిద్ధంకాగా హెచ్‌సీయూ విద్యార్థులు, పౌర సమాజం తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. జీవవైవిధ్యం గల ప్రాణులు, వృక్షాలను, ఆవాసాలను ధ్వంసం చేయటంపై తీవ్రంగా ఆగ్రహించిన సర్వోన్నత న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి పనులు చేయవద్దని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కేంద్ర సాధికార కమిటీని నియమించింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 16న జరగనుండగా.. సీఎస్ శాంతికుమారి, ఆమె అధికారుల బృందం రెండు రోజులు ఢిల్లీలోనే మకాం వేశారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపుల జరిపిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు.

**అఫిడవిట్‌లో ఏముంది!**

సెంట్రల్ యూనివర్సిటీ, గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, టిమ్స్, మరికొన్ని సంస్థలు, బస్‌స్టాండులు ఈ భూముల్లోనే ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపినట్టు సమాచారం. 50 హెక్టార్ల లోపు భూ వినియోగం, పర్యావరణ అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయని పేర్కొన్నట్టు తెలిసింది. పర్యావరణంపై ప్రభావం గురించి అధ్యయనం అవసరం లేదని, వాటిని చదును చేసేప్పుడు పర్యావరణ నిబంధనలు ఎక్కడా అతిక్రమించలేదని వెల్లడించినట్టు తెలిసింది. భూమి చదును చేసే సమయంలో చట్టాలు, నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని వివరించినట్టు తెలిసింది. అటవీ, రెవెన్యూ రికార్డుల్లో ఈ భూములను అడవులుగా పేర్కొనలేదని, సుమారు 20 ఏండ్లకు పైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున, అక్కడ చెట్లు పెరిగి అడవిలా తయారైందని నివేదించినట్టు సమాచారం. గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి జంతుజాలం ఆవాసం ఏర్పరచుకోలేదని, మార్ఫింగ్, ఏఐ ఆధారిత ఫేక్ ఫొటోలు, వీడియోలతో తప్పుదారి పట్టించారని అఫిడవిట్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. పర్యావరణ నిబంధనలు పాటిస్తూ, రాక్ ఫార్మేషన్లను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. అట్లాగే సెంట్రల్ యూనివర్సిటీ భూమికి క్లియర్ టైటిల్ అందిస్తామని పేర్కొన్నట్టు తెలిసింది.



నారాయణపేట జిల్లా గొర్లోనిబావి శివారులో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్
- సీఎం ఇలాకాలోని కొత్తపల్లి మండలం గొర్లోనిబావిలో ఎండిన పంటల పరిశీలన

మద్దూరు (కొత్తపల్లి), ఏప్రిల్ 14 : సాగు నీళ్లు అందక ఎండిపోయిన పంటలకు వెంటనే పరిహారం అందించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం గొర్లోనిబావి గ్రామ శివారులో ఎండిన వరి పొలాలను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కరెంట్ సమస్యలు, సాగునీరు లేక ఎండిన పంటలకు ఎకరాకు రూ.40 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలో పంటలు ఎండిపోతుంటే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# కంచె గచ్చిబౌలిలో చెట్లను నరకలేదు

- అడవులను పెంచడం, ప్రకృతిని కాపాడటమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి
- కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మాట్లాడారో?: శ్రీధర్‌బాబు
- బీజేపీ ప్రభుత్వాల విధ్వంసం కనిపించడం లేదా? మహేశ్, చామల, అద్దంకి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని ధ్వంసం చేసి, వన్యప్రాణులను చంపుతున్నదన్న ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తప్పుబట్టారు. తెలంగాణ గురించి మోదీ ఎందుకు అలా మాట్లాడారో తెలియదని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లను నరకలేదని, జంతువులను చంపలేదని తెలిపారు. అడవులను పెంచి ప్రకృతిని కాపాడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉందని, వాస్తవాలను కోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అటవీ భూమి లేదని, ఆ భూముల్లో వివిధ సంస్థలు ఉన్నాయని వివరించారు.



**మాట్లాడే అర్హత మోదీకి లేదు : మహేశ్‌కుమార్‌గౌడ్**

భూములపై మాట్లాడే అర్హత మోదీకి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. మోదీ ఎన్నికల ర్యాలీల కోసం బీజేపీ లక్షల చెట్లను నరికివేసిందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ర్టాల్లో చేస్తున్న విధ్వంసాలు, చెట్ల నరికివేతలు ప్రధానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూలో అనుమతులు లేని 5 భవనాలను ప్రధాని ప్రారంభించారని తెలిపారు. చెట్లను నరకడం బీజేపీ సంస్కృతి అని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూములపై మోదీ వాస్తవాలకు దూరంగా మాట్లాడారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. హరియాణా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని విడగొట్టేలా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ప్రధాని అన్ని రాష్ర్టాల మధ్య సమాఖ్య స్ఫూర్తితో ఉండాలని హితవు పలికారు.

### బీజేపీ నేతలది తప్పుడు ప్రచారం: మంత్రి శ్రీధర్‌బాబు

సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడారోనని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలిలో అటవీభూమి లేదని, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలను బద్నాం చేయకూడదని మోదీకి హితవు పలికారు. కంచ గచ్చిబౌలిలో తామేమీ పర్యావరణ విధ్వంసం చేయడంలేదని, అడవులను నరికామని, జంతువులను చంపామని వస్తున్న వార్తల్లో నిజం లేదని చెప్పారు. రాష్ట్రంలో అడవులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): భూసార పరీక్షలకు ఏప్రిల్, మే నెలలు అనువైనవని, ప్రస్తుతం ప్రతి రైతు తప్పనిసరి భూసార పరీక్షలు చేయించాలని భూసార ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్ చంద్రారెడ్డి సూచించారు. భూసార పరీక్షల వల్ల పొలాల్లో లోపించిన పోషకాలను తెలుసుకుని.. తగిన మోతాదుల్లోనే ఎరువులను వాడవచ్చునని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేలల్లో ఉన్న పోషక పదార్థాలతోపాటు సేంద్రియ, రసాయనిక ఎరువుల పోషకాలను మొక్కలకు అందజేసి అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. ఈ భూసార పరీక్షలతో భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు, ఎరువుల వినియోగం తగ్గి.. ఖర్చులు తగ్గుతాయని వివరించారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్నేరు వాగులోకి వరి సాగు అయిపోయిన తర్వాత ఎస్సారెస్పీ నీటిని వదిలిన అధికారులు

## కోతలయ్యాక కాల్వలకు నీళ్లు

డోర్నకల్, ఏప్రిల్ 14 : యాసంగి వరి పంట సాగు నీళ్ల కోసం రైతులు అరిగోస పడ్డారు. బావుల్లో పూడిక తీసి, బోరు బావులు వేయించారు. కొందరు మున్నేరు, ఆకేరు వాగుల్లో పొక్లెయిన్లతో బావులు తవ్వించారు. సాగు నీరు లేక పంట పొలాలను పశువుల మేతకు వదిలేసినా ప్రభుత్వం కనికరించలేదు. వరి సాగు పూర్తయి కోతలు కోస్తున్న సమయంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్నేరు వాగులోకి శ్రీరాంసాగర్ జలాలు విడుదల చేశారు. అధికారుల తీరుపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ నాయకులు మాత్రం రైతులకు సాగు నీరు తెచ్చి ఇచ్చినట్టుగా సంబురాలు చేసుకోవడం గమనార్హం.

# వడగండ్ల బాధితులను ఆదుకోవాలి

- ఎకరాకు 10వేల రూపాయల పరిహారం అందించాలి
- ఎమ్మెల్యే పల్లా డిమాండ్
- మంత్రి తుమ్మల, ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి విజ్ఞప్తి చేసిన పల్లా
- పలు గ్రామాల్లో అధికారులతో కలిసి పంటల పరిశీలన



జనగామ మండలం ఎల్లంలలో వడగండ్లకు రాలిపోయిన పంటను పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, ఏప్రిల్14 : వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ మండలం ఎల్లంల, పెంబర్తి, సిద్దెంకి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన పంటలను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావుతో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ వడగండ్లకు నేలరాలిన రైతులకు ఎకరాకు రూ.10వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. ఇప్పటికే సాగునీరు అందక వేసిన పంటలు ఎండిపోయాయని, ఇప్పుడు అకాల వర్షంతోపాటు వడగండ్లతో తీవ్రంగా రైతులు నష్టపోయినట్టు చెప్పారు. వరితోపాటు మామిడి, బొప్పాయి, బత్తాయి, సపోట తదితర పంటలు గాలి దుమారంతో పూర్తిగా దెబ్బ తిన్నట్టు తెలిపారు.

## క్షేత్రస్థాయికి భూభారతి చట్టం

- ప్రతి సదస్సుకు కలెక్టర్లు హాజరుకావాలి
- ఇందిరమ్మ ఇండ్లకు మంత్రి ఆమోదం మస్ట్
- వేసవిలో తాగునీటి సమస్యలపై దృష్టిపెట్టండి
- కలెక్టర్లకు సీఎం ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని కలెక్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అమలులో భాగంగా ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలని, ఈ సదస్సులకు కలెక్టర్లు హాజరుకావాలని, రైతుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో (ఎంసీహెచ్‌ఆర్‌డీ) సోమవారం నిర్వహించిన సమావేశంలో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, వేసవి తాగునీటి ప్రణాళికపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టాన్ని కలెక్టర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణపేట జిల్లా మద్దూరు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని వెల్లడించారు. ఆయా సదస్సులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరవుతారని తెలిపారు. గ్రామస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఆమోదం పొందిన జాబితాను మండల స్థాయి కమిటీలు పరిశీలించాలని, అనంతరం ఆ జాబితాను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదించాకే ఖరారు చేయాలని స్పష్టంచేశారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధచూపాలని సీఎం సూచించారు. నీటి పారుదల, తాగునీటి, విద్యుత్తు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణి సమీక్ష సందర్భంగా జిల్లాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమాలను ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి డ్యాష్‌బోర్డుతో అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. సమీక్ష సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, షబ్బీర్ అలీ, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏ వ్యవస్థలోనైనా 10% చెడ్డవాళ్లు!

మొదటిపేజీ తరువాయి...

అన్నారు. 'మా ప్రభుత్వం మిమ్మల్ని సంపూర్ణంగా విశ్వసిస్తున్నది. మీరు, మేము వేర్వేరు కాదు. మేం చేసిన చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది మీరే. ప్రభుత్వానికి రైతులు, రెవెన్యూశాఖ రెండు కళ్లలాంటివి' అని అన్నారు. రెవెన్యూ అధికారులు ఏ తప్పూ చేయొద్దని, పక్కాగా చట్టాన్ని అమలు చేద్దామని సూచించారు. 'మేం అవినీతికి పాల్పడే వ్యక్తులపైన కఠినంగా ఉంటాం.. కానీ వ్యవస్థపై కాదు. ఎవరి భూమి వారికి లెక్క రాద్దాం' అని చెప్పారు. మనుషులకు ఆధార్ మాదిరిగా ప్రతి భూమికి భూధార్ నంబర్ తీసుకొస్తామని, ప్రతి రైతు భూమికి ఆ నంబర్ ఇస్తామని చెప్పారు. తెలంగాణ సరిహద్దులనే నిర్ణయించిన రెవెన్యూ అధికారులు.. రైతుల భూమి హద్దులు నిర్ణయించలేరా అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా ఇతర జిల్లాల్లోనూ ఒక్కో మండలాన్ని ఎంపిక చేసి అమలు చేస్తామని చెప్పారు. కలెక్టర్లు ప్రతిరోజు రెండు మండలాల్లో రెవెన్యూ సదస్సులకు హాజరై ప్రజలకు భూభారతిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక ప్రభుత్వ భూములను ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు ఆ భూములపై హక్కు కల్పించేందుకు అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్ కమిటీలను పునరుద్ధరించి అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హత కలిగిన పేదవారికిప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తుందని ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భూభారతి 2025 చట్టం వందేళ్లు వర్ధిల్లుతుందని అన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, ములుగు, కామారెడ్డి జిల్లాల్లోని నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్టు తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లిలో ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

### తడిసిన ధాన్యంతో గోకినేపల్లిలో రైతుల నిరసన

ముదిగొండ, ఏప్రిల్ 14 : కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం కొనకపోవడంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తడిచిపోయిందని ఆగ్రహిస్తూ రైతులు సోమవారం ధర్నాకు దిగారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లిలో ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై తడిసిన ధాన్యంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తమ ధాన్యం కాంటా వేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని మండిపడ్డారు. సెలవుల పేరుతో ఇప్పటివరకు కాంటాలు పెట్టలేదని ఆరోపించారు. ఎప్పటికప్పుడు కాంటాలు వేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని, ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఖమ్మం జిల్లా కల్లూరులో నీటి మడుగుల మధ్య ధాన్యపు రాశులు

# అకాల వర్షానికి రైతన్న ఆగం

- తడిసిన వరి, మక్కజొన్న, మిర్చి
- నేలరాలిన మామిడి కాయలు
- ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో భారీ నష్టం



ఖమ్మం జిల్లా పుల్లయ్యబంజరలో తడిసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న కూలీలు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 14 : పలు జిల్లాల్లో కురిసిన వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, వడగండ్లతో కురిసిన వర్షానికి మిర్చి, మక్కజొన్న పంటలు తడిసిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటపై టార్పాలిన్లు కప్పినప్పటికీ గాలికి లేచిపోయి పంట తడిసిపోయింది. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సీపీఎం నాయకులు రైతులను ఆదుకోవాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వడగండ్ల వాన రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. పలుచోట్ల కోతకొచ్చిన వరి పొలాలు దెబ్బతిన్నాయి. ఆరబోసిన ధాన్యం తడిసింది. మామిడి, నిమ్మ తోటల్లో కాయలు నేలరాలాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. మహబూబ్‌నగర్‌లో జిల్లాలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి దాదాపు 2 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. రైతులు కాపాడుకునే యత్నం చేసినా ఫలితం లేకపోయింది.